# 20 వ శతాబ్ది తెలుగు కథకులు
## డా. కేతు విశ్వనాథ రెడ్డి గారి ఆకాశవాణి ప్రసంగాలు



తెలుగు కథ శత వార్షికోత్సవాల సందర్భంగా 'కౌముది' పాఠకులకి

ప్రముఖ రచయిత కలం నుంచి నెలనెలా ప్రత్యేక వ్యాస పరంపర

## పల్లెపట్టులో భారతాన్ని దర్శించిన కరుణకుమార

(1901 - 1956)

తెలుగు గ్రామీణ ప్రాంతాల్లో సంభవించిన పరిణామాల్ని చిత్రించిన కథా రచయితల్లో అగ్రగామి కరుణకుమార. ఆయన కథారచనకు ప్రేరణ ఉన్నవ మాలపల్లి. ఆ నవల కరుణకుమారను తీవ్రంగా ఆకర్షించింది. కలవరపరచింది. ఉత్తేజపరచింది. అంతేకాకుండా మాలపల్లి నవలా కర్త ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులులాగా కరుణకుమార కూడా సంఘ సంస్కరణ భావాలతోనూ ప్రభావితులయ్యారు. ఉన్నవ జాతీయోద్యమ రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్న ఉద్యమశీలి. వీరేశలింగం పంతులు సంస్కరణను ముందుకు తీసుకు వెళ్ళడానికి ప్రయత్నించిన కార్యవాది. కరుణ కుమార ఒక ఉద్యోగిగా, బుద్ధిజీవిగా, మనసా, వాచా, కర్మణా సమాజ శ్రేయస్సునూ, ప్రగతినీ కోరిన రచయితగా జీవితంలో వచ్చిన, వస్తున్న రకరకాల మార్పుల్ని కరుణ కుమార తన కథల్లోమనసుకు పట్టించుకుని చిత్రించారు. ఆ మార్పుల్లో చెడ్డవాటిని ఖండించారు. మంచి వాటిని స్వాగతించారు.

శ్రీ కందుకూరి అనంతం ఉరఫ్ కరుణకుమార పుట్టింది పశ్చిమగోదావరి జిల్లా, మెట్టింది నెల్లూరు జిల్లా. బస్సు కండక్టరుగా, కచ్చేరి గుమస్తాగా, తహసిల్దారుగా కరుకైన అనుభవ ప్రపంచాన్ని సమకూర్చుకున్నారు. సున్నితమైన హృదయంతో, నిర్భర భావుకత్వంతో బాధితుల పట్ల కరుణతో, తన అనుభవాలను కథలుగా మలిచారు. నెల్లూరు మండలం పల్లెటూళ్ళ హృదయాన్నీ, ఆ పల్లెటూళ్ళ జీవితాన్నీ, ఆ జీవితంలోని స్వార్థాల్నీ. సామాజిక ప్రేమతో వాటి భాషనూ కథల్లో ఆవిష్కరించారు. కాబట్టే 1935 - 1957 మధ్య కాలంలో వెలువడిన ఆయన కథల ద్వారా నాటి గ్రామీణ జీవిత పరిణామాలను మనం గ్రహించవచ్చు. ఆర్థిక శాస్త్రవేత్తలు సైతం అధ్యయనం చెయ్యడానికి పనికి వచ్చే వాస్తవ జీవన విశేషాలు, అప్పటి ఆర్థిక గణాంక వివరాలతో సహా కథల ద్వారా మనకు తెలుస్తాయి. ఆ వాస్తవ జీవన విశేషాలు అప్పటి ఆర్థిక సామాజిక రంగాలకు సంబంధించినవి.

మాగాణీ, మెట్టలూ, పశువుల బీళ్ళూ, ఆవులూ, కోడెలూ, మందువాల లోగిళ్ళూ, ధాన్యపు కొట్లూ, అరటి తోటలూ, కొబ్బరి తోటలూ, ఆడవాళ్ళ వంటి మీద బంగారు నగలూ, వెండి సామానూ వగైరాలున్న ప్రఖ్యాతి చెందిన కుటుంబాలతోపాటు, రెక్కల కష్టం మీద బతికే యానాదులు, మాలలు, మాదిగలు మొదలైన దళితులు కరుణ కుమార కథల్లో కనిపిస్తారు. గ్రామీణ సమాజంలోని హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాల, కులాల స్వరూపం, కులాల మధ్య వైషమ్యాలూ, వాటి కారణాలు కథల ద్వారా తెలుస్తాయి. వారి వృత్తి

వైవిధ్యం తెలుస్తుంది. ఆనాటి రాజకీయాలూ, సంస్కరణ ధోరణులూ తెలుస్తాయి. గ్రామ జీవితంతో సంబంధమున్న పట్టణాల్లోని అధికార యంత్రాంగం, రెవిన్యూ, పోలీసు, న్యాయ యంత్రాంగం స్వరూప స్వభావాలు తెలుస్తాయి. భూమీ, వ్యవసాయమూ, నీటి పారుదలా, పంటలూ, పశువులూ వీటితో ముడిపడిన కూలీలు వెట్టివాండ్లు, పాలేర్ల, వర్తకుల జీవితాల చిత్రణ కరుణకుమార కథల్లో కనిపిస్తుంది. ఆయన రాసిన నలభైలోపే అప్పటి కథా రచయితలు చాలామంది చాలా కథల్లో సాధించలేని జీవన వైవిధ్య చిత్రణను కరుణకుమార సాధించారు. అంతేకాకుండా దళిత శ్రమజీవుల ఆర్థిక సామాజిక, సాంస్కృతిక పీడనను చిత్రించారు. ఈ పీడనకు సామాజిక వర్ణ, వర్గ శ్రేణులూ, ఉద్యోగ స్వామ్యమూ నాటి రాజకీయాలూ, కరువులూ, కంట్రోలూ, రేషనింగూ నల్లబజారు ఏ ఏ రకాలుగా దోహదం చేశాయో భిన్న కథావస్తువుల ద్వారా విమర్శించారు. ఈ కథా వస్తువులకు భూమిక అయిన నేపథ్యాన్ని చిత్రించారు. అట్లాంటి నేపథ్యం నుండి సహజంగా రూపొందిన పాత్రల మనస్తత్వాలనూ, ఘర్షణనూ, భిన్న భాషా సంస్కారాలతో సహా చిత్రించారు. ఈ చిత్రణ వెనుక కరుణకుమార సామ్యవాద భావాలూ, తీవ్రమైన అహింసా ప్రేమతత్వాలూ కనిపిస్తాయి. సత్యసాధన కాంక్ష కనిపిస్తుంది. నిష్కపట కర్మాచరణ దృష్టి కనిపిస్తుంది. అంతర్లీనంగా ఆర్ద్రతా, మొక్కవోని మానవీయ దృష్టీ కనిపిస్తాయి.

కరుణకుమార కథా రచనలోని జీవిత వైవిధ్యాన్నీ, విస్తృతినీ, గ్రామీణ సమాజంలోని మానవ సంబంధాల ప్రకృతి, వికృతులనూ, నిర్మాణ చతురతనూ, మౌలికతత్వాన్నీ అర్థం చేసుకోవడానికి ఒకటి రెండు కథల్ని పరామర్శించుకుందాం.

'కొత్త చెప్పులు' కథలో చెప్పులు తేవడంలో ఆలస్యం జరిగిందని చిన్నపరెడ్డి ఇంటి మాదిగ స్త్రీని కొట్టి చంపుతాడు. ఆ హత్యను ఆత్మహత్యగా చిత్రించి రిపోర్టును చిన్నపరెడ్డి రాయిస్తాడు. ఈలోగా ఈ కథలో చిన్నపరెడ్డి కొత్త చెప్పులు వేసుకుంటాడు. కాలికి పుండయి మంచం పడతాడు. రెడ్డి ఎద్దు కూడా చచ్చిపోతుంది. మాదిగలు చచ్చిన ఎద్దును తీసుకుపోమని మొండికేస్తారు. ఒక రకంగా తిరుగుబాటు. ఆఖరుకు చిన్నపరెడ్డి కాలిపుండుతో మరణిస్తాడు. ఈ కథలో ఒకవైపు దళితుల సామాజిక నిరసన, ప్రతీకార దృష్టీ, తిరుగుబాటూ కనిపిస్తాయి. మరొకవైపు అధర్మానికి ప్రకృతి సిద్ధంగా చివరకు విఘాతం తప్పదనే ధర్మచింతన పర్యవసానం అధర్మ పరుల అపజయం! ఇది ప్రకృతి ధర్మానికి సహజం అనిపించవచ్చునేమో కానీ సామాజిక ధర్మానికి వాస్తవం కాకపోవచ్చు. కానీ రచయిత చిత్త శుద్ధితో కూడిన వేదనను ఎవరూ ప్రశ్నించలేక పోవచ్చు. జీవితం తర్క ప్రమాణాలకు పూర్తిగా లోబడుతుందని కరుణకుమార అనుకోలేదు.

'పోలయ్య' కథ దళితుల జీవితంలోని మరొకరకం పీడనను చిత్రించింది. ఇది అగ్రహార కుసంస్కారాన్ని ఎత్తి చూపిన కథ, హరిజనులు హిందువులు కాదనే సిద్ధాంత ప్రచారకుడు వేంకట శాస్త్రి, మనవని బారసాల కోసం గంగాజలంతో రైల్వే స్టేషన్లో దిగుతాడు. ఊరు చేరాలనే ఆరాటంలో పోలయ్య బండి ఎక్కాడు. మోటారు బండ్లు వేయించి బండివాళ్ళ కడుపులు కొట్టిన శాస్త్రి మిత్రుడు చెంచునాయుడి మీద పోలయ్య మాటల సందర్భంలో బాధను వెళ్ళగక్కుతాడు. తాను హరిజనున్నని కూడా శాస్త్రికి చెపుతాడు. శాస్త్రి కోపానికి అవధులు లేకపోయింది. ఊరు చేరాక తాను మైలపడ్డాననీ, ఒళ్ళు తెగ్గొల్చుకోవాల్సిన ప్రాయశ్చిత్తం పోలయ్యకు జరగాలనీ పంచాయితీ పెట్టాడు. పోలయ్య తాను క్రైస్తవుణ్ణి అని అబద్ధం చెప్పడంతో బతికి బయటపడ్డాడు. ఈ కథ 1937 జనవరిలో వచ్చింది. ఈ కథాకాలానికి రాజ్యపాలన బ్రిటీష్ వాళ్ళది. బ్రిటీష్ పాలకుల మతం క్రైస్తవం. ఆ రాజకీయాధికారం ముందు శాస్త్రి సాంస్కృతిక పెత్తనం గానీ, చెంచునాయుడి వంటి వాళ్ళ సామాజిక పెత్తనం కానీ సులభంగా సాగదు. మన సమాజంలోని కుల వ్యవస్థ తాలూకు బోలుతనాన్ని పోలయ్య కథ బట్టబయలు చేస్తుంది.

'కయ్య - కాలువ' అనే మరొక కథ ఉంది. ఈ కథలో స్వార్థపరులైన అగ్రవర్ణాల ఆస్తిపరులు దళితుల ఆస్తిని ఏ రకంగా కాజేస్తారో కరుణ కుమార చిత్రించారు. మాల కొండడు ఒకప్పుడు ఆస్తిపరురాలైన మహాలక్షమ్మ ఇంట్లో పాలేరు. బంజరు సాగుచేసి పుట్టెడు వరి ధాన్యం పండించాడు. లక్షమ్మ కన్నుగుట్టింది. కొండడి భూమి మీదే లక్షమ్మ భూమి బేరమాడింది. ఆమె నీచ బేరానికి

కొండడు ఒప్పుకోలేకపోయాడు. భూమిని అమ్మలేనని తెగేసి చెప్పాడు. మరుసటి సంవత్సరం కొండడి భూమికి నీళ్ళు బిగించింది. కాలువ వదలమని కొందరు బతిమలాడాడు. డబ్బు చెల్లించుకుంటానన్నాడు. రెవిన్యూ అధికారులకు కొండడు లంచం ఇస్తాడు. కానీ ఫలితం లేదు. లక్షమమ్మ నీళ్ళు వదలలేదు. కలెక్టరు సైతం లక్ష్మమ్మ కన్ను పేదల మీద కాదు. సంపద కూడబెట్టడం మీదే సంపద హిందూపురాణ అధి దేవత లక్ష్మి పరమాశయం అదేనా అని ఆలోచింపచేసే కథ.

ఈ మూడు కథల్లో సన్నజీవాల మీద జరిగే భౌతిక హింసా పద్ధతులు వర్ణితమయ్యాయి. ఒకవైపు గ్రామీణ సమాజమూ, మరొకవైపు అధికార యంత్రాంగమూ, రాజకీయాలూ బాధితులను కాపాడలేని ఒక పతన స్థితిని ఈ కథల్లో మనం చూడవచ్చు. ఈ పతన స్థితి మానవత్వాన్ని ఖాతరు చేయని ధన వ్యామోహం నుంచీ ఏర్పడింది. డబ్బు, అధికారంలో కీర్తి, సర్వస్వమైనపుడు ప్రేమలకు ఏమాత్రం చోటు ఉండదని నిరూపించిన కథ ఇది.

'బిళ్ళల మొలతాడు' కథ ఈ మూడు కథలకంటే భిన్నమైంది. ఈ కథలోని లక్ష్మమ్మ స్థితిమంతురాలు. కొడుకు రామిరెడ్డి, పాలేరు కొడుకు సుబ్బడి చేతిమీదుగానే సేద్యమంతా. లక్షమమ్మ కొడుకంటే ఎంత ప్రేమో, అంతే పాలేరు కొడుకన్నా. సుబ్బడికి పెళ్ళయింది. భార్య కాపురానికి వచ్చింది. లక్షమమ్మ కొడుకు రామిరెడ్డి సుబ్బడి భార్యమీద కనేశాడు. పాలేరు పనికి మానుకుని, సుబ్బడు పక్క ఊరికి కాపురం మార్చాడు. రామిరెడ్డి, తన ప్రయత్నాలు ఫలించలేదు. రామిరెడ్డికి కడుపు మండింది. దురహంకార స్వార్ధంతో సుబ్బడి మీద బిళ్ళల మొలతాడు దొంగతనం కేసు మోపాడు. కోర్టులో రామిరెడ్డి తల్లి లక్ష్మమ్మ సాక్ష్యం చెప్పింది. ఆ సాక్ష్యం వల్ల కేసు వీగిపోయింది. కొడుకు దుశ్చర్యలను కాదన్న లక్ష్మమ్మ సాక్ష్యం అది. పైగా ఆమె యానాది సంఘంలో చేరుతుంది. పతితులకు సేవ చేస్తానని సుబ్బడు, సుబ్బడి భార్య వెంట వెళ్ళిపోతుంది. జే యానాది సంఘాలకు జే! కూలీలకు జే! అంటే ఊళ్ళోని కమ్మవారూ, యానాదులూ, హరిజనులూ లక్ష్మమ్మను తమ గ్రామం జేజేలు పలుకుతూ తీసుకువెళ్ళారు. బిళ్ళల మొలతాడులోని లక్షమమ్మది ధర్మపక్ష పాతం. ఆమెది మమకారాలకూ స్వార్ధానికీ అతీతంగా వికసించే ఆదర్శీకరించిన తెగువు, సత్య సంధత. "ఉన్నతోద్యోగాలు" కథలోని తాహాశీల్దారు రాజశేఖర ధాన్య సేకరణలో హింసకాక అహింసను ఆశ్రయించి కార్యాన్ని సాధిస్తాడు. కరుణకుమార ప్రాతినిధ్య పాత్రలు ఇటువంటివారు అయితే ఏ విలువలూ, ఏ ఆదర్శాలూ, ఏ జీవకారుణ్య దృష్టిలేని కొందరు మోతుబరులూ, కరణాలూ, మునసబులూ, రెవెన్యూ యంత్రాంగంలోని పై అధికారులూ పోలీసుల లాలూచీ ప్రపంచం, ఆయన వాస్తవిక వాద దృష్టిలో పడక తప్పింది కాదు. ఆ విధంగా సామాజిక సంక్షోభ స్థితినీ, ఆ స్థితిలో ఎదగవలసిన మానవ విలువలనూ కరుణ కుమార తన కథల ద్వారా మన కళ్ళముందుంచారు. బాధ, పీడన ఎవరికి ఉందో, వారివైపు కరుణ కుమార రచయితగా నిలిచారు.

కరుణకుమార కథా రచనలో మరొక పార్శ్వం ఉంది. అది ఆయన కంఠస్వరంలో కనిపించే వ్యంగ్యం, సత్యావేశంతో కూడిన వ్యంగ్యం.

'టార్చిలైటు' కథలో కులశ్రేణుల మధ్య అంతరాల చిత్రణ కనిపిస్తుంది. ఒక అమాయకుడైన బడిపంతులు బర్తరఫ్‌కు దారితీయడం కథా వస్తువు. ఆరోగ్యవారం సందర్భంగా ఆ గ్రామంలోని స్కూల్లో ఆటలపోటీ జరిగింది. ఆటల్లో గెలిచిన పిల్లలందరూ తక్కువ కులాలు అనబడే కులాల బీదవాళ్ళ పిల్లలే. "గ్రామంలో డబ్బుగలవాళ్ళూ, గొప్పవాళ్ళూ, పలుకుబడి గలవాళ్ళూ ఇచ్చిన డబ్బుతో వస్తువులు చివరికి వాళ్ళ చేతికింద నీళ్ళు తాగే నౌకర్ల పిల్లకాయ లెత్తుకుని పోవడమూ జరిగింది." హెడ్‌మాస్టరు జకరయ్యను బెదిరించారు. జకరయ్యకు సహజంగానే దిక్కుతోచలేదు. జిల్లా బోర్డు ప్రెసిడెంటు దగ్గరికి వెళ్ళాడు. సంగతి తెలిసి మొరపెట్టుకున్నాడు. రాబోయే ఎన్నికల్లో శాసనసభకు నిలబడాలని ఆ పెద్ద మనిషి చూస్తున్నాడు. స్వయంగా తానే వచ్చి సమస్యను పరిష్కరిస్తానన్నాడు. ఈలోగా బహుమతులు పొందిన పిల్లల దగ్గరనుండి పెద్ద కులాల పెద్దలు రచ్చచేసి తిరిగి లాక్కున్నారు. చాకలి వాళ్ళ పిల్లవాడు తనకు వచ్చిన టార్చిలైటును తిరిగి ఇవ్వడానికి నిరాకరించాడు. వాడి తండ్రి లోకజ్ఞానం ఉన్నవాడు. ఇచ్చినవాళ్ళను కూడా చివాట్లు పెట్టి

పురెక్కించాడు. అలగా జనం ఒకటైంది. కత్తులూ, కటార్లు పట్టుకున్నారు. తమ వస్తువులు తమకిమ్మని వస్తువులు లాక్కున్న వాళ్ళ మీదికొచ్చారు. వ్యవహారం పోలీసులు, మేజిస్ట్రేటు దాకా వెళ్ళింది. ఫలితం జకరయ్య బర్తరఫు.. ప్రెసిడెంటు గరటయ్య సంతకంతో వచ్చిన జకరయ్య బర్తరఫు ఉత్తర్వు ఉత్తరంతో కథ ముగుస్తుంది. ప్రజాపాలకుల హ్రస్వదృష్టి లోపభూయిష్టమైన అజమాయిషీలమీద వంగ్యాస్త్రం టార్చిలైటు కథ.

'అంటూ జాడ్యం', 'భూతవైద్యం' కథల్లో కూడా నిశితమైన వ్యంగ్యం కనిపిస్తుంది. అంటు జాడ్యంలో ఒక యానాది వాడు ఆకలి జబ్బుకు గుర్రై పడిపోతాడు. కలరా సోకిందని గ్రామ మునసబు బెంబేలు పడిపోతాడు. ఆ పిరికి మునసబు చిత్రణ ఈ కథల్లో కనిపిస్తుంది.

'భూతవైద్యం'లో దయ్యాలు మనుషుల ఊహల్లోనే అనే నిజం తెలిసినప్పుడు, దెయ్యాల పీడ విరగడై పోతుందని అనుభవం ద్వారా గ్రహించిన ఒక గొల్ల నారాయణ చిత్రణ కనిపిస్తుంది.

ముందుతరం కథా రచయితలకూ సమకాలిక కథా రచయితలకూ కరుణ కుమారకూ మధ్య కొట్ట వచ్చినట్లు కన్పించే ఒక తేడా ఉంది. వాళ్ళేవరూ నిశితంగా వాస్తవికంగా గ్రామీణ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ సంబంధాల సంశ్లిష్టతను దీక్షగా చూడలేదు. నిలువుగా, అడ్డంగా చీలిన మనగ్రామాల్లోని వర్గ, వర్ణ వ్యవస్థలను ఆయనంత లోకజ్ఞానంతో పరిశీలించలేదు. భారతీయ గ్రామాలను మానవాభివృద్ధి కేంద్రాలుగా భావించిన గాంధీజీ భావాలకు కరుణకుమార సన్నిహితుడు. 'బిళ్ళల మొలతాడు' కథలో సుబ్బడు రమణి పెళ్ళిలో పెద్దలు చదివించిన పుస్తకాలలో ఒకటి గాంధీ మహాత్ముని ఆత్మకథ. మరొకటి ఉన్నవ 'మాలపల్లి' నవల. కరుణకుమార కథా ప్రపంచం రాజకీయంగా రచనపరంగా ఆ రెండు పుస్తకాల ఆదర్శమార్గంలోనే నడిచింది.